నాలుగు వీధులవతల ఉన్న పిన్నత్త గారింటికి పేరంటానికి వెళ్ళింది కొత్తగా కాపరానికొచ్చిన ఊర్మిళ. బాగా పొద్దు పోయింది. పేరంటాళ్ళు అట్టే మంది లేరు. ఎవరెవరో ఒక్కొక్కరే వస్తున్నారు, వెళ్తున్నారు. చిన్నాదవడుచు చిరునవ్వు నవ్వుతూ కాళ్ళకి పసుపు రాస్తోంది.

ప్రక్కన కూర్చున్నావిడతో మాటలు కలుపుతూ, "మిమ్మల్నెక్కడో చూసినట్టుందండీ? మీ రెక్కడ వుండేది?" అని అడిగింది ఊర్మిళ.

ఆవిడ నవ్వుతూ, "ఎక్కడ చూసుంటారు? మాది ఢిల్లీ. నాల్గు రోజుల క్రితమే 'ట్రాన్స్ఫర్' అయి ఈ ఊరు వచ్చాము. మూడో రోడ్డులో చివరి డాబాలో వుంటున్నాము" అంది.



# ఆహార్య సిద్ధి

విశ్వనాథ పావనిశాస్త్రి

"అలా చెప్పండి. మాపక్క వీథే మీది" అని "మీ పేరు" అడిగింది ఊర్మిళ.

"మోహిని" చెప్పిందావిడ.

"మీకు తగిన పేరు" అని తనగలు చేతి రుమాల్లో కడుతూ "మీవారేం చేస్తుంటారు?" అడిగింది ఊర్మిళ.

"ఇంటెలిజెన్స్ ఆఫీసరు". లేవడానికుపక్రమించింది మోహిని.

తనూ లేస్తూ "నా పేరు ఊర్మిళ. మా వారు డాన్స్ కాలేజీ ప్రిన్సిపాలు" ఆవిడ అడక్కపోయినా చెప్పింది ఊర్మిళ.

"అలాగా? వారి పేరు?" ఆసక్తిగా అడిగింది మోహిని. "వెళ్ళొస్తా నత్తయ్యా" అని లోపలికో కేకేసి భర్త పేరు చెప్పింది ఊర్మిళ.

"అంటే.... దట్ డాన్సింగ్ డైనమైట్ లక్ష్మణ్ కాదుగదా?" అంది మోహిని కళ్లు పెద్దవి చేసి.

నడుస్తున్న ఊర్మిళ తల ఓరగా తిప్పి కనుకొనల నుంచి అదోక విలాసంగా చూస్తూ "ఔనాయనే!" అంది.

మోహినికళ్ళల్లో హఠాత్తుగా వంద మెరుపులు మెరిసినాయేమోనని అనిపించింది ఊర్మిళకి.

మోహిని మొదలెట్టింది: "మీవారూ, మావారూ చాలా దగ్గరి స్నేహితులండి! మీవారు ఆ మధ్య ఒకసారి ఢిల్లీలో ప్రోగ్రాంకి వచ్చినపుడు మా యింట్లోనే దిగారు! ఆయన సత్యభామ వేషం! ఓహ్! ట్రెమెండస్! పిచ్చెక్కిపోయారనుకోండి ఢిల్లీలో మొగాళ్ళంతా. ఆయన మొగాడంటే మొదట నేను నమ్మలేకపోయాను సుమండీ. చివరికి ప్రోగ్రాం అయిపోయి రాత్రికి యింటికి వస్తూంటే నమ్మక తప్పింది కాదు గాని...."

'ఇంకా నయం....' ఊర్మిళ స్వగత మందహాసం.

మోహిని చెప్పుకుపోతోంది: "మీకు తెలుసో తెలీదో కానీండి. ఆయన చీర కడతారు! అబ్బ! సుపర్బ్! అసలు ఆడవాళ్ళు అందరూ ఆయన్ని చూసి నేర్చుకోవాలని నా అభిప్రాయం. ఏదో మా ఆయన బలవంతంమీద కట్టటమేగాని, నాకప్పటిదాకా చీర కట్టడమే రాదంటే నమ్మండి. ఆయనున్న రెండ్రోజులూ ఒక్కో స్టైల్ ఆయన కట్టి చూపించడం, నేను నేర్చుకోవడం. యిదే పని."

ఊర్మిళలోని స్త్రీ సన్నగా యిబ్బందిగా కదిలింది.

"ఇప్పుడీ కట్టిన స్టయిల్ ఉందే! ఇది మాత్రం ఎంత ట్రైచేసినా నావల్ల కాలేదు. చివరికి ఆయనే ఎంతో శ్రమపడి తనే నాల్గయిదుసార్లు విప్పి నాకు కడితేనేగాని నాకు రాలేదు. ఇప్పుడెలా వుంది? బాగా కుదిరిందా?"

'మైగాడ్!' ఊర్మిళకి మతిపోయింది. చీకట్లో చిలిపిగా అడిగినట్లుంది మోహినిని చూస్తే.

ఊర్మిళ నుంచి వెంటనే సమాధానం రాకపోయేసరికి "ఏమండీ! బాలేదా?" నిరాశగా అడిగింది మోహిని.

"ఎబ్బెబ్బే! అదేం లేదండి. బ్రహ్మాండంగా వుంది మీ విగ్రహానికి. మీ అందానికి తగిన 'స్టైల్'. "ఎప్పుడూ ఇదే కట్టండి."

ఉపచారానికి అన్నా, ఏదో యిబ్బంది. అసూయా ధ్వనించాయి ఊర్మిళ గొంతులో.

"మీరు చాలా కలుపుగోలుగా, ఎంత చక్కగా మాట్లాడతారండీ!" అని, "ఈ రోడ్లోనేనా మీ యిల్లు?" అడిగింది మోహిని.

"ఔనండి! ఇహనే ఉంటాను!" అని 'మళ్ళీ కలుద్దాం' అన్నట్టుగా ఓ నవ్వు నవ్వింది ఊర్మిళ.

"పదండి నేనూ వస్తాను. ఇంతదాకా వచ్చి మీ యిల్లు చూడకుండా వెళ్ళడమా? ఆయన రావడానికి ఇంకా టైముంది లెండి" అంది మోహిని. ఆహ్వానించాలని తన కనిపించకపోయినందుకు సిగ్గుపడిపోయింది ఊర్మిళ. మోహినిని తీసుకెళ్ళి తన భర్తకి వచ్చిన ఎవార్డులూ, బిరుదులూ బహుమతులూ, తమ యిల్లూ అన్నీ చూపించింది. బెడ్ రూమ్ చూస్తూ మోహిని చొరవగా టేబుల్ మీదవున్న లక్ష్మణ్ ఫొటో ఫ్రేముని చేతుల్లోకి తీసుకుని "ఓహ్!" అంటూ మంచం మీద పడుకుంది.

ఆశ్చర్యం వేసింది ఊర్మిళకి. ఏమిటీవిడ వింత ప్రవర్తన? తన భర్తతో ఎంత పరిచయం ఉంటేమటుకు తన దగ్గర యిలాగా ప్రవర్తించడం? ఇలాగా మాట్లాడటం? ఛీ! సిగ్గులేకపోతే సరి! అయినా పరాయి మగాడి చేత చీర కట్టించుకునే ఆడది యిలా కాక యింకెలా ప్రవర్తిస్తుంది. అయినా ఆ పరిచయం చీర వరకేనో? యింకా.... ఛఛ! ఈవిడెలాటిదయినా తన భర్త అలాటివాడా? కాదే! అయినా ఈ మగాళ్ళని నమ్మమన్న దెవర్లే!!

ఊర్మిళ అలా అనుకుంటూండగా, "రియల్లీ హీ ఈజ్ మార్వెలస్! కదూ! ఊర్మిళా?" అంది మోహిని, పరవశంగా లక్ష్మణ్ ఫొటో గుండెలకి హత్తుకుంటూ.

అరికాలి మంట నెత్తికెక్కింది ఊర్మిళకి— "చూడండి మోహినీదేవిగారూ! ఎరక్కపోయి మిమ్మల్ని పలకరించాను. మీరు చాలా అందగత్తెలేగాని, మీకు ఎక్కడ, ఎలా "బిహేవ్" చెయ్యాలో తెలిసినట్లులేదు. ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మా ఆయన వచ్చే వేళయింది. మీ ఆయనకూడా వస్తారేమో? ఇహ లేద్దామా?" మర్యాదతో కూడిన ఒక విసురుంది ఊర్మిళ కంఠధ్వనిలో.

మోహిని దిగ్గున మంచంమీంచి లేచి, "ఎవరే మీఆయన?" అంటూ ఊర్మిళ నడుం చుట్టూ చెయ్యివేసింది.

ఊర్మిళ అదిరిపడి, ఒకడుగు వెనక్కివేసి, చెయ్యి విడిపించుకోబోయింది.

ఈలోగా మోహిని, రెండో చెయ్యి కూడా ఆమె నడుం చుట్టూ వేసి దగ్గిరికి లాక్కుంది.

ఆశ్చర్యపడిపోతూ మోహిని కళ్ళల్లోకి చూసింది ఊర్మిళ. ఆ కళ్ళూ, ఆ చేతులూ తనకి బాగా పరిచితమే!

విరగబడి నవ్వుతూ, జడ ఉన్నపళంగా తీసి మంచంమీద పడేసి, "ఇప్పుడు చెప్పు ఎవరే మీ ఆయన?" అన్నాడు లక్ష్మణ్.

అవాక్కయిపోయి, గుడ్లప్పగించి చూస్తూ అలాగే ఉండిపోయింది ఊర్మిళ.

"మీరు స్త్రీ వేషం వేస్తే మీ అమ్మగారు కూడా గుర్తుపట్టలేరట గదా! నేనైతే చిటికెలో, చిటికెలో పట్టేస్తా! మీ రెంత, మీ వేషం ఎంత అని సవాల్ చేసావు గదా? ఏదీ పట్టు?" అంటూ విజయగర్వంతో ఆమెని ఒడిసి పట్టుకొని పైకెత్తాడు లక్ష్మణ్.

సిగ్గుల బరిణె అయిపోయిన ఊర్మిళ, జగన్మోహనములైన చూపుల్తో పరాజయ మొప్పుకొని, చేతులలో ముఖాన్ని దాచేసుకొని, శయ్యమీద వాలిపోయింది. ఆరాత్రికి లక్ష్మణ్ వేషంచేత మాత్రమే స్త్రీగా మిగిలిపోయాడు. ●


కోణార్క్ వారి 1984 జులై 20 విడుదలలు!

జాతిబొమ్మ - పైడిపాల రూ. 15/-
(ఆంధ్రజ్యోతి సీరియల్)

కృష్ణరంజిత - యం. లలితకుమారి రూ. 15/-
(డైరెక్ట్ నవల)

మధురజీవితం - సి. విమలాగణేశ్ రూ. 18/-
(డైరెక్ట్ నవల)

ఇది మేఘసందేశము - వక్కలంక పద్మావతి రూ. 12/-
(ఆంధ్రపత్రిక సీరియల్)

గుడ్డి దర్బార్ - వసుంధర
(ఆ.ప.స. సీరియల్)
రూ. 15/-

త్వరలో వెలువడుతోంది!

వచన మహాభారతం
విద్వాన్ దేవరకొండ చిన్నికృష్ణశర్మ
క్వాలికో బౌండు, మూడు సంపుటాలు
1/8 క్రౌన్ సైజు, 3,200 పేజీలు,
ముందుగా అడ్వాన్సు పంపినవారికి
ఫ్రీ పోస్టేజితో సెట్ పంపబడును
రూ 225/-

కోణార్క్ పబ్లికేషన్స్
మ్యూజియం రోడ్డు,
విజయవాడ-2.

TULASI • BHASKIR

నవజ్యోతి నవలా కుసుమాలు

- చిట్టూరెడ్డి సూర్యకుమారి
సూర్యచంద్ర
చిత్రభూమి సీరియల్
రు 15-00

రాగజ్వాల
ఆంధ్రపత్రిక సీరియల్
రు 15-00

సంగీత ఆంధ్రభూమి సీరియల్ రు 10-00

లల్లాదేవి
తిరుచరణాలు
ఆంధ్రపత్రిక సీరియల్
రు 20-00

ఛత్రపతి శివాజీ
డైరెక్టు నవల
రు 20-00

శ్వేతనాగు ఆంధ్రప్రభ సీరియల్ రు 20-00

పోలాప్రగడ రాజ్యలక్ష్మి
ఇటుడౌరు-అటువెర్రూ
ఆంధ్రజ్యోతి సీరియల్
రు 15-00

పాటిబండ్ల విజయలక్ష్మి
ప్రేమానందలహరి
విజయ సీరియల్
రు 20-00

శ్రీమతి సూర్యాకాంతం (సినీనటి) ఇంటింటి వంటలు రు 15-00

పుస్తకం ధరలో 10/- రూపాయలు M.O. చేయండి
మిగిలిన మొత్తానికి V.P.P. లో పుస్తకం పంపగలము.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్ విజయవాడ 2

NAVRANG